



ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న వి.మనీషారెడ్డి -ప్రజాశక్తి, పార్వతీపురం

చెస్‌తో మానసిక ఉల్లాసం

జాతీయస్థాయిలో రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - సీతానగరం

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో గెలుపొందిన విజేతలు జాతీయస్థాయి పోటీలకు వెళ్లారని, అక్కడ కూడా తమ ప్రతిభతో జాతీయస్థాయిలో గెలుపొంది రాష్ట్రానికి మంచి పేరును తీసుకురావాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి క్రీడాకారులకు పిలుపునిచ్చారు. మానసిక శక్తి సామర్థ్యాలను రూపొందించే ఆట చదరంగమని, క్రీడాకారులు ఈ ఆటలోనే కాక అన్ని క్రీడల్లో తమ ప్రతిభను చాటాలని అన్నారు. 69వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇంటర్ డిస్ట్రిక్ట్ చెస్ ఛాంపియన్ షిప్ 2025-26 పోటీలు (అండర్ 14,17,19 బాల బాలికలు) మండలంలోని జోగింపేట ఏపి గిరిజన సంక్షేమ వసతి పాఠశాలలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి చదరంగం పోటీలను ప్రారంభించి, చదరంగం ఆడారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది గెలుపొందనున్న విజేతలను అభినందిస్తూ, మిగిలిన క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో మరింత పట్టుదలతో ముందుకెళ్లాలని సూచించారు. చదరంగంలో ఆన్ లైన్ టోర్నమెంట్లు జరుగుతున్నాయని, అందులో పాల్గొని మీ క్రీడాప్రతిభను మరింత మెరుగుపర్చుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి క్రీడాకారుడు ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలని, చేసుకోలేని వారిని నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని వ్యాయామ ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పోటీల ద్వారా మన రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని, చదరంగంతో పాటు అన్ని రకాల క్రీడల్లో ప్రతిభ కనబర్చిన రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి వెళ్లాలని, ఆ వేదికపై ఎక్కడ చూసిన మనవాళ్లే ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి వచ్చిన క్రీడాకారులకు పార్వతీపురం మన్యం జిల్లా ఆతిథ్యం ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. విప్రతి ఏటాడాది చదరంగం నిర్వహించడం జిల్లాకు గర్వకారణమని, రాష్ట్రస్థాయి పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తూ, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డిఇఒ బి.రాజ్‌కుమార్, ఎఎస్ఎస్ ఎపిసి ఆర్.తేజేశ్వరరావు, డిఐఇఒ వై.నాగేశ్వరరావు, ఇతర అధికారులు, రాష్ట్రస్థాయిలో వచ్చిన క్రీడాకారులు, కోచ్లు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



చెస్ ఆడుతూ పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి

మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై

1972కు సమాచారం అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లాలో మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల అక్రమ రవాణా జరుగుతున్నట్లు తమ దృష్టికి వస్తే 1972 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత ఈ విషయంలో చురుగ్గా పాల్గొని, వివరాలను అందజేయాలని కోరారు. మాదకద్రవ్యాల రవాణా నివారణ, రహదారి భద్రతపై అవగాహన సదస్సు శుక్రవారం స్థానిక ఆర్‌టిసి డిపోలో రవాణా, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను వాహన డ్రైవర్లు తెలిసిచేసినా, తెలియక చేసినా శిక్షార్హులని స్పష్టం చేశారు. కావున ప్రతి డ్రైవర్ తమ వాహనాల్లో తీసుకువెళ్లే బ్యాగులను, సంచులు, ఇతర సామాగ్రిపై దృష్టి సారించాలని, అనుమానస్పదంగా ఉంటే తక్షణమే టోల్ ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వాలని అన్నారు. తద్వారా పోలీసులు తదుపరి చర్యలు తీసుకుంటారని, దీనివల్ల సమాచారం అందించే వ్యక్తికి ఎటువంటి నష్టం ఉండబోదని అన్నారు. అతివేగం, మద్యం, మత్తు పదార్థాలు సేవించి వాహనం నడపి ప్రమాదాలకు గురికావడం వల్ల డ్రైవర్ కుటుంబంతో పాటు వాహనంలో ఉండే కుటుంబాలు నష్టపోతాయన్న విషయాన్ని గుర్తెరగాలని అన్నారు. కాబట్టి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ వాహనాలను నడపాలని, ప్రతీ డ్రైవర్ కచ్చితంగా రహదారి భద్రత నియమాలు పాటించాలని కలెక్టర్ తేల్చిచెప్పారు. ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో విశాలామైన రోడ్లు లేకపోవడం, ఉన్న రోడ్లలో సక్రమంగా రహదారి భద్రత నియమాలు పాటించకపోవడంతో ఈ ఏడాదిలో సుమారు 80 మంది మృతి చెందగా, 150 మంది వరకు క్షతగాత్రులయ్యారని అన్నారు. ప్రతి వాహన డ్రైవరు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. ఆర్టీసి డ్రైవర్లు ఎక్కడ పడితే అక్కడ వాహనాలను ఆపకుండా, సురక్షిత ప్రదేశాల్లో నిలపాలని సూచించారు. అలాగే ప్రతి వాహన డ్రైవరు అనుమాన స్పదంగా ఉండే బ్యాగులు, సామాగ్రిపై దృష్టి సారించి 1972కు సమాచారం అందించాలని అన్నారు. ముఖ్యంగా కోరాపుట్, రాయపూర్ ప్రాంతాల నుంచి గంజాయి రవాణా అవుతుందని, ఈ ప్రాంతాలే కాక ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారిపై నిఘా ఉంచి సమాచారం చేరవేయాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, ఎఎస్‌పి వి.మనీషా రెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి పి.వెంకటేశ్వర రావు, జిల్లా రవాణా శాఖాధికారి టి.దుర్గా ప్రసాద్ రెడ్డి, ఎక్సైజ్, పోలీస్ తదితర శాఖల అధికారులు, ఆర్టీసి అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ వాహన డ్రైవర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత : ఎస్‌పి

పార్వతీపురం టౌన్ : పోలీస్ సిబ్బంది శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో "పోలీస్ వెల్ఫేర్ డే" (గ్రీవెన్స్ డే) నిర్వహించారు. పోలీసు అధికారులు, సిబ్బంది సిబ్బంది సమస్యలను ఎస్పీకి విన్నవించుకోగా, సత్వర పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించారు. మిగిలిన సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపుతామని పోలీస్ సిబ్బందికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో సిసి సంతోష్ కుమార్ , సిబ్బంది పాల్గొన్నారు.

10న గిరిజన మంత్రి ఇంటి ముట్టడి

ఆదివాసీ గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ పిలుపు

రూ.50 లక్షలు ఎక్స్ గ్రేషియో ప్రకటించాలని డిమాండ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అనారోగ్యంతో మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చలో సాలూరు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఇంటిని ముట్టడించనున్నట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి.అనిల్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆదివాసీ గిరిజన భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనారోగ్యంతో మరణించిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. విజయనగరంలో గురువారం జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో గిరిజన మంత్రి గిరిజన విద్యార్థుల మరణాల ఎక్స్‌గ్రేషియాపై మాట్లాడిన మాటలు సరికాదని ఖండించారు. ప్రభుత్వాలపై నమ్మకంతోనే పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారన్నారు. అక్కడ సరైన మౌలిక వసతులు, సదుపాయాల్లేకపోవడంతో విద్యార్థులు అనారోగ్యంబారిన పడి చనిపోతున్నారని అన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. విద్యార్థులకు నష్టపరిహారం ప్రకటించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. దీనిపై అనేకసార్లు పేరెంట్స్ కమిటీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రభుత్వానికి ఎంత డిమాండ్ చేసినా చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. గిరిజన విద్యార్థులు ఇంతమంది మరణిస్తుంటే గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి పట్టడం లేదా అని ప్రశ్నించారు. బస్సు ప్రమాదంలో, గుడిలో తొక్కిసలాటలో మరణించిన వారికి ప్రభుత్వం రూ.15 లక్షలు నష్టపరిహారం చెల్లించిందని, విద్యార్థుల మరణాలపై ఎందుకు స్పందించడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏదైతే గిరిజన సంక్షేమ శాఖ మంత్రి తొలి సంతకమైన పాఠశాలలో ఆరోగ్య కార్యకర్తల నియామకానికి చేశారో అది అమలు చేయాలని, నష్టపరిహారం ఈనెల 9లోపు ప్రకటించకపోతే 10న పెద్ద ఎత్తున విద్యార్థులను, ప్రజానీకాన్ని సమీకరించి మంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎ.గంగారావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి మండంగి రమణ, మండల నాయకులు ఎం.సన్యాసిరావు, కె.గంగారావు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు

సోషలిజమే సకల సమస్యలకు పరిష్కారం

మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజల సకల సమస్యలకు సోషలిజమే పరిష్కారమని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ అన్నారు. శుక్రవారం స్థానిక గిరిజన సామాజిక భవనంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యాన సోషలిజం విశిష్టత- సామ్రాజ్య వాద దోపిడీ అన్న అంశంపై యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ, కార్పొరేట్ అనుకూల విధానాలు అమలు వేగవంతమైన క్రమంలో ప్రజలు తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టి వేయబడ్డారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపర్చి కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన విధానాలను ప్రపంచ వ్యాప్తంగా పాలకులు అవలంబిస్తున్నారని, మనదేశంలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు దాసోహం అయ్యాయని విమర్శించారు.. ఇటీవల కాలంలో అమెరికన్ సామ్రాజ్యవాదానికి ప్రత్యామ్నాయంగా చైనా కమ్యూనిస్టు ప్రభుత్వం ప్రజా అనుకూల ప్రత్యామ్నాయ విధానాలతో ముందుకు రావడం మంచి పరిణామని తెలిపారు..1917లో విజయవంతమైన రష్యన్ విప్లవం సోషలిస్టు విధానాలతో ప్రపంచానికే దిక్సూచిగా నిలిచిందని ,అదే స్ఫూర్తితో ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు, రైతాంగ సమస్యల పరిష్కారానికి , కార్మిక వర్గ హక్కులు కాపాడేందుకు ప్రజా ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కె గంగునాయుడు, ఎం తిరుపతి రావు, ఎన్ వై నాయుడు, వి ఇందిర, వైమన్మధరావు, కె రామస్వామి, రెడ్డి వేణు, రెడ్డి ఈశ్వరరావు, బి.లక్ష్మి, ఆర్ శ్రీదేవి, గొర్లి వెంకటరమణ, బివి రమణ, కె.భాస్కరరావు, బంటు దాసు, కెసాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు..



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

దగ్ధమైన బస్సును పరిశీలించిన డిప్యూటీ కమిషనర్

ప్రజాశక్తి - పాచిపెంట

ఆంధ్ర-ఒడిశా ఘాట్‌రోడ్డులో దగ్ధమైన ఒడిశా ఆర్టీసీ బస్సును ఆ రాష్ట్రం డిప్యూటీ కమిషనర్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ప్రమోద్ కుమార్ పాండా శుక్రవారం పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కొరాపుట్ ఎంవిఐ చంద్ర బిశ్వాస్, టెక్నికల్ మేనేజర్ సబీర్ రాజ్ కొరాపుట్ ఆర్‌టిసి డిపో మేనేజర్ ఈశ్వర్ మహాపాత్రో, సాలూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ జేవిస్ ప్రసాద్, పాచిపెంట ఎస్సై వెంకట సురేష్ పాల్గొన్నారు

గిరిజన పిజిఆర్‌ఎస్‌కు 12 వినతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 12 వినతులు అందినట్లు జాయింట్ కలెక్టర్, ఇన్‌ఛార్జి ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లాలో తొలిసారిగా స్థానిక ఐటిడిఎ గిరిమిత్ర హాలులో గిరిజన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం శుక్రవారం పిఒ సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ గిరిజనుల వ్యక్తిగత, సామాజిక, అభివృద్ధి సంబంధిత సమస్యలను నేరుగా సంబంధిత శాఖల అధికారుల సమక్షంలో ఉంచి పరిష్కారం పొందేలా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కావున ఐటిడిఎ పరిధిలోని గిరిజనులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకొని, తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. కాగా ఈ కార్యక్రమంలో అందిన సమస్యల్లో కొన్ని వివరాలు ఇలా..

కురుపాం మండలం కుంచేమానుగూడ నుంచి మండంగి ప్రసాదరావు అర్జీని అందిస్తూ తమ గ్రామానికి విద్యుత్ స్థంబాలు, ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటు చేయాలని కోరారు. నీలకంఠాపురం నుంచి గ్రామస్తులు దరఖాస్తును అందిస్తూ 23 కుటుంబాలు ఉన్న తమ గ్రామానికి ఏడు విద్యుత్ స్థంబాలు, ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. కకురుపాంలో ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని టి ఆర్ఎఫ్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు రొబ్బ లోవరాజు, ఐ. రామకృష్ణ వినతిని అందజేశారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మ వలస మండలాల్లో ఎక్కువగా పత్తి సాగు చేస్తున్నారని, ఇక్కడ ప్రభుత్వం పత్తి కొనుగోలు చేయకపోవడం వల్ల దళారీలబారిన పడి గిరిజన రైతులు మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జియ్యమ్మవలస మండలం మరువాడ నుంచి ఆరిక చంద్ర శేఖర్ మాట్లాడుతూ నిడగల్లుగూడ, చినతోలు మండగూడ, పెద్ద దొడ్డి గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాలను పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఒ పి.మురళీధర్, ఐటిడిఎ పరిధిలోని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట ఐటిడిఎలో...

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు ఆరు వినతులు వచ్చాయి. పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో పిజిఆర్ఎస్ నిర్వహించారు. పెద్దపొల్లంకి వలసలోనే యధావిధిగా అంగన్వాడీ కేంద్రం కొనసాగించాలని సుమలత విన్నవించారు. పులిపుట్టి చెందిన జి సుజాత తనకు వింతంతు పెన్షన్ ఇప్పించాలని కోరారు. సిరికొండ, ఒబ్బంగికి ఆశా వర్కర్ పోస్ట్ మంజూరు చేయాలని ప్రతిభ కోరారు. కె.వీరగొట్టంకు చెందిన రామారావు ఏదైనా ఉపాధి కల్పించాలని కోరారు. గ్రీవెన్స్‌లో డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్ రావు, ఇఇ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రయివేటీకరించొద్దు : సిఐటియు

ప్రజాశక్తి - పాలకొండ

మధ్యాహ్నం భోజనం పథకం ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం భోజనం పథకం నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నంలో భాగంగా ప్రతి మండలంలో అన్ని పాఠశాలల్లో వంట విధానాన్ని రద్దుచేసి మండలానికి ఒక చోట స్మార్ట్ కిచెన్ పేరుతో సామూహిక వంటశాల నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారని, దీన్ని సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అనేక ఏళ్లుగా మధ్యాహ్న భోజన నిర్వహకులు సేవా దృక్పథంతో ఈ పథకం నిర్వహిస్తున్నారని, లక్షల రూపాయలు ముందస్తు పెట్టుబడులు పెట్టి నిర్వహిస్తుంటే వారికి నష్టం చేకూర్చేలారాష్ట్ర ప్రభుత్వం ఆలోచించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వీరందరికి కనీస వేతనాలు చెల్లించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకుండా ఉన్న ఉపాధిని కూడా తీసేయడం అత్యంత నీచమైన చర్యని అన్నారు. ఈ ప్రైవేటీకరణ విధానాన్ని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న నిర్వాహకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఐక్యం చేసి పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ .హిమప్రభ, జిల్లా కమిటీ బి.అమరవేణి మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం మండల ప్రతినిధులు జి.చిన్నముడు, ఎస్.గౌరి, కె.దుర్గమ్మ, ఆర్.సావిత్రమ్మ, బి.కరుణ, బి.లక్ష్మి, ఎస్.దేవకి, కె.హేమలత, ఎ.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణారావు

గరుగుబిల్లి: మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని, దీన్ని సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. మండలంలోని వేలాదిమంది మంది విద్యార్థులకు ఒకే చోట వంటవండి వాహనాల ద్వారా పంపిణీ చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. ఈ ప్రైవేటీకరణ విధానాన్ని మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం, సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, దీనిపై జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న నిర్వాహకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఐక్యం చేసి పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంఇఒ జోగారావుకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి దాసరి వెంకట నాయుడు, మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బి మణికుమారి, పి.పావని, నాయకులు అన్నపూర్ణమ్మ, సూర్యం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు జర్మన్ భాషలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - సీతంపేట

ఎస్‌టి, ఎస్‌సి విద్యార్థినిలకు విశాఖపట్నంలో జర్మన్ భాషలో ఉచితంగా శిక్షణ ఇచ్చి నర్స్ ఉద్యోగానికి ఎటువంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయి కృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలమహిళలు ఈనెల 11న స్థానిక వైటిసిలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. బిఎస్‌సి నర్సింగ్, జిఎన్ఎం కోర్సు పూర్తి చేసిన విద్యార్థినిలే ఇందుకు అర్హులన్నారు. 8 నుంచి 10 నెలల వరకు జర్మనీ భాషలో శిక్షణ ఇచ్చి అక్కడ ఉద్యోగాలు కల్పించనున్నట్టు తెలిపారు.


చదువు, పడక ఒకే చోట

మరుగుదొడ్ల పక్కనే వంటలు
ఇదీ ఎస్‌టి బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల దుస్థితి

ప్రజాశక్తి - పాలకొండ

సంక్షేమ గృహాల్లో తలదాచుకుంటున్న విద్యార్థులకు సమస్యలు తప్పడం లేదు. సంక్షేమ గృహాల్లోని విద్యార్థుల సమస్యలపై దృష్టి పెట్టాల్సిన అధికారులు, పాలకులు గాలికి వదిలేశారు. విద్యార్థుల సమస్యలపై ఏ ఒక్కరూ కూడా నోరు మెదిపిన పరిస్థితి లేదు. దీంతో సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థులు సమస్యల కొలువులో తలదాచుకుంటున్నారు. పాలకులు, అధికారులు మారినా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ఇదీ పట్టణంలోని ఎస్‌టి బాలుర ఆశ్రమ పాఠశాల దుస్థితి.

పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో ఎస్‌టి బాలుర ఆశ్రమ పాఠశాలలో సమస్యలు కొలువు తీరుతున్నాయి. దీంతో విద్యార్థులు సమస్యల మధ్యనే కాలం గడుపుతున్నారు. వసతి సమస్యతో పాటు అనే సమస్య వెంటాడుతున్నాయి. చాలీచాలని గదులతో విద్యార్థులు అవస్థలుపడుతున్నారు. ఈ వసతిగృహంలో మూడో నుంచి పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు 240 మంది వరకు ఇక్కడ బస చేస్తున్నారు. వీరికి సదుపాయాలు అరకొరగా ఉన్నాయి. చాలీచాలని గదులతో వసతి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు.



మరుగుదొడ్ల ఎదురుగానే ఉన్నకిచెన్‌షెడ్



తరగతిలోనే భోజనం చేస్తున్న విద్యార్థి

240మంది విద్యార్థులకు గానూ 10 గదులే ఉన్నాయి. దీంతో అక్కడే తరగతి గదులు, అక్కడే తినడం, పడుకోవడం చేయాల్సిన పరిస్థితి. విద్యార్థులకు సరిపడా వసతి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మరుగుదొడ్లు పక్కనే వంట

ఈ వసతి గృహంలో విద్యార్థులకు భోజనాలను మరుగుదొడ్ల దగ్గర వండుతున్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మరుగుదొడ్ల పక్కనే వంటలు వడడం వల్ల పరిశుభ్రత లోపిస్తోందని, దుర్వాసతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే 240మంది విద్యార్థులకు కేవలం ఆరు మరుగుదొడ్లే ఉన్నాయి. దీంతో విద్యార్థులు కాలకృత్యాలకు ఆరుబయటకు వెళ్లాల్సి పరిస్థితి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వసతిగృహాల్లో సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

గర్భిణుల వసతిగృహ సిబ్బందిని కొనసాగించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ పరిధిలో గల గిరిజన గర్భిణుల వసతిగృహాల్లో పని చేస్తున్న సిబ్బందిని కొనసాగించాలని పలువురు గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గిరిమిత్ర హాల్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐటిడిఎ పిఒకు పలువురు గిరిజన సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. గుమ్మలక్ష్మీపురం, సాలూరు వైటీసీలో నడుస్తున్న గర్భిణుల వసతిగృహంలో పనిచేస్తున్న సిబ్బందిని యధావిధిగా విధులను కొనసాగించాలని, పెండింగ్లో ఉన్న జీతాలు చెల్లించాలని కోరారు. గత కొంతకాలంగా పలు ఆశ్రమ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు మృతి చెందారని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరుపున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఆ పాఠశాలల్లో పనిచేసిన ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు, ఆరోగ్య సిబ్బందిని సస్పెండ్ చేయడం సరికాదని చెప్పారు. వారిపై సస్పెన్షన్లు ఎత్తివేయాలని, డిమాండ్ చేశారు. అసంపూర్తి భవనాలను పూర్తిస్థాయిలో నిర్మించాలని గిరిజన నాయకులు పల్ల సురేష్, దుక్క సీతారాం, ఆరిక చంద్రశేఖర్, ఇంటికుప్పల రామకృష్ణ, రొబ్బ లోవరాజు, మంచాల ఈశ్వరరావు, జట్ల బంగారురాజు, కోలక గౌరమ్మ కోరారు.

ట్రెక్కింగ్‌కు అనుకూల ప్రాంతాలను సిద్ధం చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ట్రెక్కింగ్ కు అనుకూలంగా ఉన్న అడవులు, జలపాతాలు, వ్యూ పాయింట్లను ప్రకృతి ప్రేమికుల అందుబాటులోకి తేవడమే తమ ఉద్దేశ్యమని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేలా తీర్చిదిద్ది, మౌలిక వసతులు కల్పించాలని అందుకే ఈ శిక్షణ కార్యక్రమమని స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రకృతిని ఆశ్వాదించేందుకు ట్రెక్కింగ్ ఏర్పాటుపై గిరిజన యువతకు శిక్షణ కార్యక్రమం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రెక్కింగ్ కు అవసరమైన సామాగ్రిని సమకూర్చి తద్వారా గిరిజన యువతకు ఉపాధితో పాటు ఆదాయం వచ్చేలా చేయడమే దీని లక్ష్యమని గైడ్లకు వివరించారు. అలాగే పర్యాటక ప్రాంతాలపై వెబ్ సైట్ రూపొందించాలని, ఇతర వెబ్ సైట్లతో ఈ వెబ్ సైటును అనుసంధానించాలని జిల్లా అటవీ శాఖాధికారిని ఆదేశించారు. అంతకుముందు విశాఖపట్నం నుంచి వచ్చిన పర్యాటక సంస్థ ప్రతినిధులతో గైడ్లకు పీపీటి ద్వారా శిక్షణ ఇచ్చారు. అనంతరం గైడ్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెసి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఎఫ్ఒ జిఎపి ప్రసూన, అటవీ, పోలీస్ శాఖల అధికారులు, గిరిజన యువత తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ తీరుపై గుర్రుమంటున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ కమిషనర్ తీరుపై కౌన్సిలర్లు గుర్రమంటున్నారు. కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో పాటు నగర పంచాయతీలో ఎటువంటి పనులు చేసినా వారికి తెలియపరచకపోవడంతో కౌన్సిలర్లు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తుంది. తాజాగా తెలకలవాని చెరువు దగ్గర చెత్తను జెసిబి, ట్రాక్టర్లతో ఎత్తుతున్నప్పటికీ కౌన్సిలర్లు కమిషనర్‌ను అడిగితే సరైన సమాధానం చెప్పలేదు. తనకేమీ తెలీదంటూ సమాధానంతో కౌన్సిలర్లు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఇటీవల ఇద్దర్ని ఔట్సోర్సింగ్ పద్ధతిలో నియామకాలు చేపట్టడంపై కూడా కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది. కమిషనర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించడం పట్ల వారంతా తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు తెలిసింది.

గ్రీన్ అంబాసిడర్ల బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - పాలకొండ

బకాయి వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రీన్ అంబాసిడర్లు ఎంపిడిఒ ఎంవి రంగారావుకు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కాదా రాము అధ్యక్షతన శుక్రవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ నిత్యం పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్ డీజిల్, కరెంటు చార్జీల భారాలు భరించలేక కుటుంబాలు ఆర్థికంగా గడుపుతున్నారని, దీనికితోడు ప్రతినెల సక్రమంగా జీతాలు చెల్లించడం ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తున్న విధంగా పంచాయతీ గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు రూ.21వేలు జీతం చెల్లించాలని, జిఒ 132, 142, 680లు అమలు చేయాలని, అమలు చేయని అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శులతో జాయింట్ సమావేశం వేయాలని, సమస్యలు పరిష్కారాన్ని కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

వెంకంపేటలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మండలంలోని వెంకంపేటలో బందలుప్పి వైద్యాధికారి డాక్టర్ సిహెచ్.శంకరరావు ఆధ్వర్యంలో 104 వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. 60ఏళ్ల పైబడిన వారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారితో పాటు, గర్భిణీలు, బాలింతలకు అన్ని వైద్య పరీక్షలు చేసి వారికి కావాల్సిన మందులు ఇప్పు, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జ్వరం లక్షణాలున్నవారికి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలన్నారు. వ్యాధుల దృష్ట్యా గ్రామాల్లో రోజూ వైద్య పరీక్షలు చేస్తుండాలని, ఎటువంటి వ్యాధి లక్షణాలున్నా అటువంటి వారిని త్వరగా గుర్తించి వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. 104 వాహనంలో మందుల కొరత లేకుండా చూడాలని, దీర్ఘకాలిక వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం తదితర వ్యాధులున్న వారికి నెలకు సరిపడే మందులు, పూర్తిస్థాయిలో అందించాలని 104 సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ శ్రీరాములునాయుడు, వైద్య సిబ్బంది,104 సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో చినమేరంగి హైస్కూల్ విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

జిల్లా పోలీసు శాఖ నిర్వహించిన మహిళల సంరక్షణలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలో జియమ్మ వలస మండలం చినమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని మధుమిత చౌదరి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. విజేతకు జిల్లా ఎస్పీ రూ.5వేలు నగదు బహుమతి అందించారు. విద్యార్థిని తండ్రి ప్రసన్నకుమార్ చౌదరి గుమ్మలక్ష్మీపురం మండలం చాపరాయి బిన్నిడిలో పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. పాఠశాల హెచ్‌ఎం ఆదినారాయణ మూర్తి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. గతంలో ఇదే పాఠశాలకు చెందిన ముత్తేశ్వరి కూడా జిల్లా ప్రథమ స్థానాన్ని పొందడం గమనార్హం.



వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న సామాజిక కార్యకర్త పెంటయ్య

270 మందికి దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - సీతంపేట

మాస్టర్ కె.పార్వతీకుమార్ 81వ జయంతి సందర్భంగా రామగిరి క్షేత్రంలో వాల్మీకి వనవాసి శ్రేయో సంస్థ అధ్యక్షులు, సామాజిక కార్యకర్త ఎస్పీ పెంటయ్య మాస్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం 270 మంది వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ప్రతి ఏటా నిర్వహిస్తామన్నారు. చుట్టుపక్క గ్రామాల నుంచి ప్రజలు వచ్చారని తెలిపారు. ఇలాంటి సామాజిక సేవతో ముందుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి రామారావుస్వామి, నవీన్, భాస్కరరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - వీరఘట్టం

ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించి బోధనకే పరిమితం చేయాలని యుటిఎఫ్ వీరఘట్టం మండల శాఖ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని. తలవరం, పనస నందివాడ, కుమ్మరిగుంట, నీలానగరం, ఎంవి పురం, తెట్టంగి, ఆడారు, బిటివాడ, వండవ, పాపంపేట, బొడ్లపాడు, తూడి, తదితర గ్రామాల్లోని పాఠశాలలను యుటిఎఫ్ ప్రతినిధులు సందర్శించి మాట్లాడారు. వీరగాధ, 5.0 వికషిత్ భారత్, తదితర బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. 12వ పిఆర్‌సి కమిషన్ పునరుద్ధంచాలని, 29 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలని అన్నారు. ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలన్నీ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిరాజు, అధ్యక్ష కార్యదర్శులు కె.గోవిందరావు, బోనంగి దుర్గాప్రసాద్, సీనియర్ నాయకులు కె.గౌర్నాయుడు, ఎస్ మహేష్, బి రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో రైతులను భాగస్వామ్యం చేయాలి

ప్రజాశక్తి - బలిజిపేట

ప్రకృతి వ్యవసాయం పట్ల రైతులను పెద్దఎత్తున భాగస్వామ్యం చేయాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ టి బాబూరావునాయుడు అన్నారు. వ్యవసాయం క్షేత్ర సందర్శన చేసిన ఆయన బలిజిపేటలో జరుగుతున్న ట్రైనీ ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఆర్‌డిఎస్ విత్తనాలను పరిశీలించారు. మామిడి తోటలో 16 రకాల అంతర పంటలను వేసుకోవాలని, దానివల్ల ఆదాయం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్.నాయుడు, హేమలత, ప్రకృతి వ్యవసాయ ప్రబంధుకులు ఎం.శ్రావణ కుమార్, తిరుపతి, ట్రైనీలు పాల్గొన్నారు.

పోలమాంబ అమ్మవారి ట్రస్ట్ బోర్డు సభ్యులు వీరే

ప్రజాశక్తి -మక్కువ

రాష్ట్ర జాతరగా అవతరించిన పోలమాంబ అమ్మవారి ట్రస్ట్ బోర్డ్ ఎట్టకేలకు ఏర్పాటు కానున్నది. ధర్మకర్తల మండలికి సంబంధించిన పదిమంది పేర్లను మంత్రి ప్రతిపాదించినట్లు ఆలయ ఇఒ శ్రీనివాస్ శుక్రవారం వెల్లడించారు. నైదాన చిన్న తిరుపతి, తీళ్ల సింహాచలం, అఖ్యాన సింహాచలం, గొట్టాపు భవాని, జి.లలిత కుమారి, సిహెచ్ దాక్షారాణి, ఎ.వెంకటేష్, వి.నారాయణమ్మ, ఎస్.సత్యవత్తమ్మ, వి.రాము ప్రతిపాదించినట్లు ఆయన వెల్లడించారు. ఎపి ధార్మిక మంత్రిత్వ శాఖ జారీచేసిన ఉత్తర్వులు మేరకు త్వరలో మంత్రి సంధ్యారాణి సమక్షంలో ఒకర్ని చైర్మన్గా ఎన్నుకొని ప్రమాణ స్వీకార కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

అక్రమ రవాణాపై స్పందించిన ఇరిగేషన్ అధికారులు

'ప్రజాశక్తి'వార్త కు స్పందన

ప్రజాశక్తి - కురుపాం


స్థానిక ఇరిగేషన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో గల సోమసాగరం చెరువులో మట్టి అక్రమ రవాణాపై గురువారం 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనానికి అధికారులు వెంటనే స్పందించారు. ఇరిగేషన్ శాఖ అధికారుల బృందం శుక్రవారం ఆ చెరువు వద్దకు వెళ్లి పరిస్థితులను పరిశీలించి చెరువులో తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలను తనిఖీ చేశారు. మట్టి తరలింపుకు సంబంధించి అనుమతులు ఉన్నాయా లేదా అనే వివరాలు సేకరించారు. చెరువు పరిసర ప్రాంతంలో మట్టి రవాణా కోసం ఎలాంటి అనుమతులు జారీ చేయలేదని తెలిసింది. అక్రమంగా మట్టి తరలింపు జరిగిందని తేలితే సంబంధితులపై చర్యలు తప్పవని చెరువుల రక్షణలో ప్రజల సహకారం కీలకమని అధికారులు పేర్కొన్నారు.

వైసిపి నుంచి జనసేనలో చేరికలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని వబ్బంగి పంచాయతీలో గల పలు గ్రామాల్లోని వైసిపి కార్యకర్తలు జనసేనలోకి ఆ పార్టీ మండల అధ్యక్షులు నేరేడుబిల్లీ వంశీ ఆధ్వర్యంలో శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలు, పరిపాలన, అభివృద్ధి, నచ్చి జనసేన పార్టీలోకి చేరుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సీనియర్ నాయకులు అధికారి అనిల్, అజయ్, శంకు, శివకుమార్, సురేష్, రాంబాబు, మాధవ పాల్గొన్నారు.

దేశ ఔన్నత్యాన్ని పెంచే దిశగా నడుచుకోవాలి : కలెక్టర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

ప్రజాశక్తి - పార్వతీపురం

వందేమాతరం గీతం స్ఫూర్తితో భారత దేశ ఔన్నత్యాన్ని పెంచే దిశగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి పిలుపు నిచ్చారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా దేశాన్ని ఏకతాటిపై తెచ్చిన మహోజ్వల మంత్రం వందేమాతరం గీతమని కొనియాడారు. వందేమాతరం జాతీయ గీతం 150 ఏళ్ళు పూర్తిచేసుకున్న సందర్భంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఎన్‌సిసి, స్కౌట్, పాఠశాల విద్యార్థుల మధ్య కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం పోరాడాల్సిన ఆవశ్యకతను, స్ఫూర్తిని నింపుకునేలా వందేమాతరం గీతాన్ని బంకించంద్ర ఛటోపాధ్యాయ రాశారని, ఈ గీతం ఇచ్చిన శక్తితో ప్రతి పౌరునిలో ఉద్యమ స్ఫూర్తి పెరిగిందని అన్నారు. దాన్ని దేశం మొత్తం కూడా నాటి నుండి నేటి వరకు ఆలపించడం జరుగుతుందని, ప్రతీ పాఠశాలలో ఆ గీతాన్ని ఆలపిస్తూ ప్రతీ రోజు గుర్తు చేసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు. అలాగే దేశానికి మంచి సేవలు అందించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, డిఇఒ బి.రాజ్ కుమార్, డివిఇఒ వై.నాగేశ్వరరావు, జిల్లా రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎం.శ్రీరాములు, ఎన్‌సిసి, స్కౌట్, పాఠశాల విద్యార్థులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో...

వందేమాతరం గీతం స్ఫూర్తితో భారతమాతకు సేవలు అందించాలని పార్వతీపురం సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బంకిం చంద్ర ఛటోపాధ్యాయ రాసిన వందేమాతరం గీతాన్ని దేశవ్యాప్తంగా ఆలపించుకుంటున్నామని గుర్తుచేశారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల వందేమాతర గీతాలాపన

సీతానగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రిన్సిపల్ ఎల్.దాలినాయుడు, అధ్యాపకులు వందేమాతర గీతాన్ని ఆలపించి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమానికి ఈ గీతం ఎంతో ఉపయోగపడిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రామకృష్ణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని బొక్కుపేట పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కృష్ణదాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ గీతాన్ని ఆలపించి చేశారు.

వేదాంత జూనియర్ కాలేజీలో....

పార్వతీపురం: స్థానిక వేదాంత జూనియర్ కళాశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి వందేమాతరం వందేళ్ల ఉత్సవం నిర్వహించారు. సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి వందేమాతర ఉద్యమం గురించి విద్యార్థులుకు తెలిపారు. గేయ రచయిత బకిం చంద్ర ఛటర్జీ రచించిన ఆనంద మఠ్ అను నవల నుండి సేకరించబడిన వందేమాతర విశిష్టత ని వివరించారు. కార్య క్రమంలో కళాశాల చీఫ్ మెంటర్ డాక్టర్ పెంట అప్పారావు , డైరెక్టర్, ప్రిన్సిపల్ ఎస్ఐ నాయుడు, అకమిడిక్ డీన్ రమణబాబు, ఇంచార్జి ప్రిన్సిపల్ లోకేష్ నాయుడు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ప్రధానోపాధ్యాయులు టి.శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన వందేమాతరం గీతాలాపనలో స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొని విద్యార్థులు తో కలిసి జాతీయ జెండాను పట్టుకొని వందేమాతరం గేయం ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్ పర్సన్ కడ్రక కళావతి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ధర్మచంద్రారెడ్డి, ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, డిప్యూటీ ఎంపిడిఒ జి.రమేష్ బాబు, ఎంఇఒ ఎన్. సత్యనారాయణ, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి, కూటమి నాయకులు కోలా రంజిత్ కుమార్, వెంపటాపు భారతి, రమణమూర్తి, పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఐవి లక్ష్మి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, పంచాయతీ కార్యాలయంలో ఇఒ వై.గిరి ఆధ్వర్యంలో కూటమి నాయకులు వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర ఛటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అలాగే వీరఘట్టంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, నీలానగరం, బిటివాడ, తలవరం, తెట్టంగి, గంగాని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, రేగులపాడు కెజిబివి ,కంబరవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తదితర పాఠశాలల్లో వందేమాతరం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వందేమాతరం గేయానికి 150 ఏళ్ల సందర్భంగా ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ వి ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో బోధకులు శంకరరావు లలిత కుమారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వందేమాతరం గీతలాపన చేశారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ టిటి రత్నకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, ఇంజనీరింగ్ అధికారులు రెవెన్యూ సిబ్బంది మెప్మా సిబ్బంది మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

వెంకటనాయుడు వైఖరి మార్చుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం

రాజకీయ అండతో గిరిజనులపై బెదిరింపు చర్యలు మానుకోవాలని టిడిపి సీనియర్ నాయకులు గొట్టాపు వెంకటనాయుడుకు సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి హెచ్చరిం చారు. గిరిజన సంఘం నాయకులు పాలమిట్ట రాముపై వెంకటనాయుడు దురుసు ప్రవర్తనను ఖండిస్తూ శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద మీడియాతో మాట్లాడారు. పోరాటం గిరిజన రహదారి, దాన్ని హరించే హక్కు ఏ ఒక్కరికీ లేదని తెలిపారు. గురువారం వెంకటనాయుడు రాముకు ఫోను చేసి జమదాల సచివాలయం వద్ద నువ్వు ధర్నా చేయడమేమిటని ప్రశ్నిస్తూ, అనేక దుర్భాషలాడుతూ ఇకనైనా ఇటువంటి పనులు మానుకోవాలని, లేకుంటే నీ సంగతి తేలుస్తా అని హెచ్చరిస్తూ మాట్లాడడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. ఈ చర్యలను సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. సచివాలయం గాని, జమదాల, ఆ చుట్టు పక్కల గ్రామాలు గాని గొట్టాపు జాగీరు కాదని, గిరిజనులపై, గిరిజనేతర్లపై పెత్తనం చెలాయిస్తూ రాజకీయం చేపడితే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. జమదాల ప్రాంతంలో చేస్తున్న భూ సర్వేల్లో ఉన్న తప్పులను సరి చేసుకోవాలని సచివాలయంలో ఫిర్యాదు చేస్తే దాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం వెనుక రహస్యమేమిటని ధ్వజమెత్తారు. ఆ సర్వేల వెనుక ఉన్న అక్రమాలపై వెంకటనాయుడు ప్రమేయం ఉందని వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాలమిట్ట రాము మాట్లాడుతూ అన్యాయం జరిగిందని స్వయంగా ప్రజలే తమ వద్దకు వచ్చారని, సర్వేల్లో తప్పులను గుర్తిస్తూ రీ సర్వే చేపట్టాలని సచివాలయంలో కోరినందుకు, గొట్టాపు వెంకటనాయుడు రాత్రి 10 గంటల సమయంలో ఫోన్ చేసి హెచ్చరించడం తగదని, గతంలో కూడా ఎన్నో పోరాటాలు చేసి ఉన్నామని తెలిపారు. ప్రజా సమస్యలను గుర్తించి ప్రజల వద్దకు వెళ్లడం తన హక్కు అని, దీనిపై బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బంటు దాసు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరివ్వాలంటూ ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి - బలిజిపేట



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

తమకు తాగునీరివ్వాలని, ఎంపిడిఒ, ఎఒ, ఇఒపిఆర్‌డి, పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ మండంలోని పెద్దింపేట మహిళలు ఖాళీ బిందెలతో గ్రామ సచివాలయం నుంచి గ్రామ పురవీధుల్లో నిరసన ర్యాలీ శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు, గ్రామ నాయకులు వెన్నెల వేణు మాట్లాడుతూ పెద్దింపేటలో బోర్లు ఉన్నా తాగడానికి ఉపయోగపడడంలేదని, దీంతో మంచి నీరు లేక ప్రజలు అల్లాడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మంచినీరు అందజేయాలని కోరారు. గ్రామంలో ఇంటింటికి సంతకాల సేకరణ చేసి అక్టోబర్ 18న ఎంపిడిఒ కార్యాలయం దగ్గర నిరసన, ధర్నాగా తెలియజేస్తే స్పందించిన ఎంపిడిఒ, ఎఒ, ఇఒపిఆర్‌డి, పంచాయతీ కార్యదర్శి వచ్చి వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అంతవరకు సమీపాన గల పామాయిల్ తోటలో మంచినీరు ఉన్న రైతుతో మాట్లాడి అక్కడి నుంచి పైప్‌లు వేసి గ్రామంలో ట్యాంకు కట్టి తాగునీరు అందిస్తామని చెప్పారని తెలిపారు. అయితే నేటికి రెండు వారాలవుతున్నా అధికారులు తాగునీటి సమస్య పరిష్కరించకపోవడం దారుణమన్నారు. స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ తక్షణమే స్పందించి తమ గ్రామానికి మంచినీళ్లు అందజేయాలని కోరారు. సిపిఎం నాయకులు యమ్మల మన్మధరావు మాట్లాడుతూ గ్రామంలో శుభ్రమైన తాగునీరు లేక కలుషిత నీరు తాగి అనారోగ్యాలకు గురౌతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఊరుకు దూరంగా పామాయిల్ తోటలో ఉన్న రైతు బోరు నుంచి నీరు తెచ్చుకుంటున్నారని, ఇప్పుడు ఆ రైతు కూడా నీరు ఇవ్వడంలేదన్నారు. పెద్దింపేటలో 8 చేతి పంపు బోర్లు ఉన్నా వాటి నుంచి వచ్చే నీరు తాగడానికి పనికిరాదని, కలుషితం, ఉప్పు నీరు వహిస్తుందని తెలిపారు. గౌరీపురం, సువర్ణముఖి నది నుంచి పెద్దింపేట వరకు పైపులైన్లు వేసి విడిచి పెట్టారు తప్ప మంచినీళ్ల ట్యాంకు కట్టలేదన్నారు. పది రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని అధికారులు ఇచ్చిన హామీ నేటికీ పరిష్కారం కాలేదన్నారు. ఈ నిరసనతో ప్రభుత్వం దిగువచ్చి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, లేనిచో బిందెలతో చలో కలెక్టరేట్ చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో వెన్నెల కృష్ణ, బంతిని, గౌరీశ్వరరావు, మజ్జి దుర్గారావు, రాములమ్మ, సీతారావమ్మ, లక్ష్మమ్మ, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో కేన్సర్‌కు అడ్డుకట్ట : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని, ముందస్తు స్క్రీనింగ్‌తో కేన్సర్‌ను జయించవచ్చని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా స్థానిక డిఎంహెచ్‌ఒ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొని ఆరోగ్యకర జీవనశైలి, కేన్సర్ రహిత నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ సమాజంలో జీవన ప్రమాణాలు పెరగడం, జీవన శైలిలో మార్పులు రావడంతో అసంక్రమిత వ్యాధులు (దీర్ఘ కాలిక వ్యాధులు) పెరుగుతున్నాయని బిపి, షుగర్‌తో పాటు ఈ రోజుల్లో కేన్సర్ కేసులు కూడా నమోదవుతున్నాయని అన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది కేన్సర్ స్క్రీనింగ్ పక్కగా, పారదర్శకంగా నిర్వహించి నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్ ప్రాథమిక లక్షణాలు సత్వరమే గుర్తించాలని, తద్వారా పిఒయులో తుది నిర్ధారణ పరీక్షలు చేయించి తగు చికిత్స అందించి పర్యవేక్షించాలని అన్నారు. తద్వారా కేన్సర్ ముప్పు నుంచి తప్పించవచ్చని పేర్కొన్నారు. జిల్లా ఎన్‌సిడి అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు మాట్లాడుతూ కేన్సర్ స్క్రీనింగ్ లక్ష్యంగా ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్.సిడి4.0 సర్వే నిర్దేశించిన లక్ష్యాలు చేరేలా నిర్వహించాలన్నారు. ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిఐఒ డాక్టర్ విజయ్ మోహన్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రఘు కుమార్, డాక్టర్ కౌశిక్, లీలారాణి, ఉషారాణి, డెమోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట : డిప్యూటీ డిఎంహెచ్‌ఒ విజయ పార్వతి ఆధ్వర్యంలో నేషనల్ కేన్సర్ అవేర్నెస్ డే సందర్భంగా స్థానిక ఏరియా ఆసుపత్రి నుండి పార్క్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యమన్నారు. సమయానికి స్క్రీనింగ్ చేయిస్తే కేన్సర్‌ను జయించవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి బి.భాను ప్రతాప్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జె మోహన్ రావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుస్తూరులో 'మా ఊరికి మలేరియా వచ్చింది'

ప్రజాశక్తి - కొమరాడ

మారుమూల గిరిజన గ్రామమైన కుస్తూరులో మా ఊరికి మలేరియా వచ్చిందనే కార్యక్రమాన్ని మండల అధికారులు చేపట్టారు. శుక్రవారం పాలెం పంచాయితీలోని గిరిశిఖర గ్రామమైన కుస్తురు గ్రామానికి అధికారులు కాలినడకన వెళ్లి గ్రామంలో మలేరియా బాధితుల కుటుంబ సభ్యుల పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఎస్.రమేష్ మాట్లాడుతూ కుస్తురులో నిమ్మక రవికిమలిరియా సోకినట్లు గురువారం రాత్రి సమాచారం వచ్చిందని తెలిపారు. వెంటనే మండల స్థాయి అధికారులకు తెలియజేసి శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మా ఊరుకి మలేరియా వచ్చింది అనే కార్యక్రమాన్ని మాదిలింగి వైద్య అధికారి తనూజ, డిఎల్‌పిఒ, ఎంపిడిఒ, డిప్యూటీ ఎంపిడిఒ, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అనారోగ్యం లక్షణాలున్న ప్రతి ఒక్కరికీ వివిధ రక్తపరీక్షలు నిర్వహించి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. గ్రామమంతా ఐఆర్ఎస్ ఎఎంసి దోమల మందు పిచికారీ చేయించారు. అంగన్వాడీ, పాఠశాలలో ఏర్పాటు చేసిన మధ్యాహ్నం భోజనం పథకాన్ని పర్యవేక్షించి, పలు సూచనలు, సలహాలు అందజేశారు. సీజనల్ వ్యాధులు, జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ అవసరమైన వారు వైద్య చికిత్సలు చేయించుకోవాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యానికి రక్ష

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో, ఆశ్రమ పాఠశాలల్లో గల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు, విద్యార్థులు ఆరోగ్య వంతులుగా ఉంటారని ఎంపిడిఒ ఐవి లక్ష్మి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలో పరిసరాలు, విద్యార్థులకు పెడుతున్న భోజనాలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమం లో ఆరోగ్యసిబ్బంది ఉన్నారు.

వట్టిగెడ్డ రిజర్వాయర్ పనులు పూర్తి చేయండి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం రావాడ వట్టిగెడ్డ రిజర్వాయర్ పనులను జైకా నిధులతో పూర్తి చేయించాలని ఒట్టిగెడ్డ రిజర్వాయర్ వైస్ చైర్మన్ ముంజేటి ప్రసాద్ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి వినతి అందజేశారు. శుక్రవారం గుమ్మలక్ష్మీపురంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వైస్‌చైర్మన్ ప్రసాద్ ఈ సమస్యలు తెలిపారు. వట్టిగెడ్డ రిజర్వాయర్ పనులకు జైకా నిధులు రూ.44 కోట్ల 85 లక్షలు మంజూరయ్యాయని, గత ప్రభుత్వం అరకొరగా పనులు చేసి నిలిపివేశారని తెలిపారు. వెంటనే జైకా నిధులతో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పనులు ప్రారంభించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే చిన మేరంగిలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనం పూర్తిగా మరమ్మతు లకు గురైందని దీంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. వెంటనే నిధులు మంజూరు చేసి వసతిగృహం మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకు వెళ్తానని ఎమ్మెల్యే జగదీశ్వరి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు

కిరపలో రైతులకు శిక్షణ

సీతంపేట : మండలంలోని కిరపలో ఆర్ట్స్ స్వచ్ఛంద సంస్థ, నాబార్డ్ ఆధ్వర్యంలో నడుస్తున్నటు మన్యం సహజ ఉత్పత్తుల కంపెనీ సీతంపేట వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో ఆచార్య ఎన్జీరంగా 125వ జన్మదిన సందర్భంగా రైతులకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. రబీలో పొలాలను ఖాళీ ఉంచకుండా తక్కువ పంట కాలమైనా అపరాలను సాగు చేయాలని, తక్కువ నీటితో పంటను ఎలా పొందాలనే విషయాలపై పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ పి.వెంకటరావు అవగాహన కల్పించారు. మన్యం సహజ ఎఫ్‌పిఒ సిఇఒ శంకర రావు మాట్లాడుతూ ఆదివాసీ ఉత్పత్తులను దళారులకు అమ్మకుండా మన్యం సహజ ఉత్పత్తుల సంఘానికి విక్రయించాలని కోరారు. అనంతరం ఆచార్య ఎన్‌జి రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యవసాయ పరిశోధన స్థానంలో కూడా శాస్త్రవేత్త పి సౌజన్య, ఆర్‌బికెవి శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.అనంత విహారి, యస్. స్రవంతి, విద్యార్థులు ఆచార్య ఎన్జీరంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రకృతి వ్యవసాయ సాగును పరిశీలించిన మలావి దేశ బృందం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గొరడలో నాబార్డ్ సహకారంతో నిర్వహిస్తున్న జీవా ప్రాజెక్ట్‌ను ఐఫాడ్ సభ్యులు, మలావి దేశానికి చెందిన మలావి అగ్రికల్చర్ అండ్ ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్మెంట్ కార్పొరేషన్ బృందం సందర్శించి జీవా కార్యక్రమాలు తెలుసుకున్నారు. జట్టు ట్రస్టు తోటపల్లిలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు, వ్యవసాయ ఉత్పాదకాలు, జీవ ఉత్ప్రేరకాలు సందర్శించి ప్రశంసించారు. పెంగవలో పువ్వుల ఈలెమ్మ, దివాకర్, మండంగి కమలకుమారి, మండంగి లలిత, కృష్ణారావు గిరిజన రైతులు సాగుచేస్తున్న మాతోట కార్యక్రమం సందర్శించి పశుసంపద, వాటి వల్ల కలిగే ఆర్థిక, పర్యావరణ ఉపయోగాలను, వాటికి అవసరమైన ఆహారం ఏర్పాటు దాని ప్రణాళిక (ఫాడర్) గూర్చి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐఫాడ్ హెడ్ మొహమ్మద్ అలీ, పహడ్‌సింగ్, విదేశీ పర్యాటకులు బృందం నాయకుడు పీయూష్ ములకనో, మలావి దేశ ప్రతినిధులు థామ్సన్ కుంవెండ , అలెజాంద్రో ఎంకిసో, తియద్రి లాత్రేయిల్లే, మాలావి నుండి ప్లస్ ములేకనో, పీటర్ చిపేట, థామ్సన్ కుంవెండ, లోటి న్యాసులు, నాబార్డ్ ఎజిఎం, రేఖ గోనల్, డిడిఎం సాదు దినేష్ కుమార్‌రెడ్డి, జట్టు ట్రస్టు చైర్మన్ పారినాయుడు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సరోజ్ ప్రహరాజ్, జీవ కమిటీ చైర్మన్ తాడంగి జమ్మయ్య, బంగారాజు, గవరయ్య, అనంత్, పేకాపు మురళి, డైరెక్టర్లు, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ప్రభోదు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకించండి

ప్రజాశక్తి - సాలూరు

ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర పిలుపునిచ్చారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ స్థానిక బోసుబొమ్మ సెంటర్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాన్ని పార్టీ శ్రేణులు ఇంటింటికి తిరిగి, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు, విద్యార్థులకు కలిగే నష్టాన్ని వివరిస్తూ సంతకాలు సేకరిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు గిరి రఘు, కౌన్సిలర్ గొర్ల వెంకటరమణ, జరజాపు శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా స్థానిక పాత బస్టాండ్ కూడలి వద్ద మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన ఓపెన్ స్టాల్ ద్వారా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజల మద్దతు కోరుతూ వారి నుంచి సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ వైఎస్ చైర్మన్ యిండుపూరు గుణ్ణేశ్వరరావు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, బిసి సెల్ అధ్యక్షులు గొర్లి మాధవరావు, వివిధ వార్డుల కౌన్సిలర్ సభ్యులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్వతీపురంలో సంతకాలు సేకరిస్తున్న జోగారావు

పాలకొండ : మండలంలోని గొట్ట మంగళాపురంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం వైసిపి ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ ఈ సంతకాలు సేకరణకు ప్రజలంతా స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కణపాక సూర్య ప్రకాష్, సర్పంచ్ కరణం బాబ్జీరావు, మాజీఎంపిటిసి కరణం నానిబాబు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కరణం చినబాబు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

40 లీటర్ల నాటుసారా స్వాధీనం.. వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - కురుపాం

నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని మూలిగూడ జంక్షన్ వద్ద శుక్రవారం వాహనాలను తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంతో అక్రమంగా నాటుసారా రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఆ వ్యక్తి నుంచి 40 లీటర్ల నాటుసారా, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై రాజశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

300 లీటర్ల బెల్లం ఊట నేలమట్టం

సీతంపేట: మండలంలో తాడిపాయి కొండలో ధోనుబాయి ఎస్సై షేక్‌మస్తాన్ ఆధ్వర్యంలో శుక్రవారం 300 లీటర్లు పులిసిన బెల్లం ఊటలు నేలమట్టమై పది లీటర్లు నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. సంబంధించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ తిరునాధరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ పైనుంచి జారిపడి వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - కొమరాడ

ద్విచక్ర వాహనం పైనుంచి జారిపడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై కె.నీలకంఠం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రాజ్యలక్ష్మీపురానికి చెందిన కాద అనసూయ (75) తన ఆరోగ్యం బాగోలేని కారణంగా పార్వతీపురం ఆసుపత్రికి వెళ్లి మందులు తీసుకొని తన బంధువు మోటార్ సైకిల్‌పై తిరిగి ప్రయాణమైనట్లు తెలిపారు. పార్వతీపురం ఆర్టీవో ఆఫీస్ ఎదురుగా గల స్పీడ్ బ్రేకర్లపై సదరు మోటార్ సైకిల్ డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి తన మోటార్ సైకిల్‌ను నియంత్రణ చేసుకోలేకపోయాడు. దీంతో వెనుక కూర్చొన్న అనసూయ స్పీడ్ బ్రేకర్ వద్ద మోటార్ సైకిల్‌పై నుంచి తుళ్ళి రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు వెంటనే గమనించి పార్వతీపురం జిల్లా ఆసుపత్రి తరలించారు. అనసూయ పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆమె కుమార్తె కాసరపు వనజాక్షి తెలిపినట్లు చెప్పారు. ఈ మేరకు కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.